వారంలో పూర్తయ్యేనా?

సీఎం గ్రామానికి రూ.50 కోట్ల పనులు మంజూరు

న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్, వంగూరు



పూర్తయిన గ్రామ పంచాయతీ భవనం



సౌర పలకల ఏర్పాటుకు ఓ ఇంటిపై మార్కింగ్ ఇస్తున్న అధికారులు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామంలో దసరా నాటికి అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. సీఎం ఈనెల 12న విజయదశమి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి రానున్నారు. అందుకు తగ్గట్టుగా గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామంలో సౌర సిస్టంను ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఎంపిక చేశారు. అధికారులు సర్వే చేస్తున్నారు. కానీ 10 రోజుల సమయం మాత్రమే ఉండటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ అన్ని శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ ఇటీవలే రెండు సార్లు అధికారులతో సమీక్షించారు. రెండు రోజుల్లో సౌర పలకల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించనుండగా వారంలోపు పూర్తయ్యే అవకాశం లేదు.

● సీఎం తండ్రి ఎనుముల నర్సింహారెడ్డి పేరుతో రూ.40 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. బీసీ కమ్యూనిటీ హాల్ రూ.20 లక్షలతో పూర్తి చేశారు. గ్రంథాలయం పనులను రూ.20లక్షలతో చేపట్టగా పనులు చివరి దశలో కొనసాగుతున్నాయి. రూ. 25 లక్షలతో పశువైద్యశాల భవనం నిర్మించారు. రైతు వేదికకు రూ.10లక్షలు ఖర్చు చేసి ఆధునికీకరించారు. ప్రహరీ, వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు చేశారు. శ్రీశైలం రహదారి నుంచి కొండారెడ్డిపల్లి వరకు ఆరు కిలోమీటర్ల పొడవునా నాలుగు వరసల రహదారి నిర్మాణానికి పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తి చేసేందుకు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. పాఠశాల భవనంపై అదనపు గదులను రూ.14లక్షలతో చేపట్టారు. ఆ పనులు చివరి దశలో ఉన్నాయి. రూ.2 కోట్లతో ఆంజనేయస్వామి ఆలయం పనులు కొనసాగుతున్నాయి. సీఎం వచ్చే నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎల్లికల్ నుంచి కొండారెడ్డిపల్లి మీదుగా శ్రీశైలం రహదారి వరకు రెండు వరుసల రహదారికి శంకుస్థాపన చేశారు. భూగర్భ మురుగు పారుదల పనులు చేయాల్సి ఉంది.

● సౌరదీపాలు మొదట కొద్ది మందికే..: గ్రామంలో సౌరదీపాలు సీఎం చేతుల మీదుగా ప్రారంభించటానికి 20 ఇళ్లను గుర్తించి సిద్ధం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి సౌరదీపాలు అమర్చే పైలెట్ ప్రాజెక్టు కింద రూ.15 కోట్లు కేటాయించారు. ప్రక్రియ అమలు చేసేందుకు రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

తుదిదశలో పనులు..

కొండారెడ్డిపల్లి గ్రామంలో చాలా వరకు పనులు పూర్తయ్యాయి. వర్షాకాలం ముగిసిన తర్వాత కొన్ని పనులు చేయాల్సి ఉంటుంది. చిన్నారుల ఉద్యానం, పాఠశాల భవనం పనులు కొనసాగుతున్నాయి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రహదారుల పనులు వర్షాకాలం కారణంగా ప్రారంభించలేదు.

-డా.రమేశ్, అభివృద్ధి పనుల నోడల్ అధికారి, నాగర్‌కర్నూల్

ఉచిత న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కందనూలు, న్యూస్‌టుడే : ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయసేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవా సంస్థ అధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి. సబిత తెలిపారు. రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల ప్రకారం సోమవారం పట్టణంలోని సబ్ జైలును సందర్శించి న్యాయమూర్తి మాట్లాడారు. ఖైదీలకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. అనంతరం జైలు పరిసరాలు పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. జైలు పర్యవేక్షకుడు కారి నాగరాజు పాల్గొన్నారు.

సర్దుబాటు షురూ

300 మంది ఉపాధ్యాయుల ప్రక్రియ ప్రారంభించిన విద్యాశాఖ



ఊర్కొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కందనూలు, న్యూస్‌టుడే : సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమైంది. అక్టోబర్ మొదటి వారంలో ప్రక్రియ పూర్తి చేయడానికి విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 3,742 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం 3,374 మంది మాత్రమే ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 368 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసలు ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 61 ఉండటం గమనార్హం. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 71 బడులలో ఒక్క విద్యార్థి కూడా కొత్తగా ప్రవేశాలు నమోదు చేసుకోలేదు.

మార్గదర్శకాలు ఇవీ..: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రారంభించాలని సెప్టెంబర్ 20న అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి 1 నుంచి 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 11 నుంచి 60 మందికి ఇద్దరు ఉపాధ్యాయులు, 61 నుంచి 90 మందికి ముగ్గురు ఉపాధ్యాయులు, 91 నుంచి 120 మందికి నలుగురు ఉపాధ్యాయులు, 121 నుంచి 105 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు, 153 నుంచి 200 మంది విద్యార్థులకు ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలని మార్గదర్శకాలు విడుదల చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 200 మంది విద్యార్థుల కన్నా ఎక్కువ ఉంటే ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయనున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలపై వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. 11 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	816
చదువుతున్న విద్యార్థులు	48,887
మొత్తం ఉపాధ్యాయులు	3,742
పని చేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య	3,374
సర్దుబాటు చేయనున్న వారి సంఖ్య	300
ఏకోపాధ్యాయ పాఠశాలలు	199
ఇద్దరు ఉపాధ్యాయులతో కొనసాగుతున్నవి	183
10 మంది విద్యార్థుల్లోపు ఉన్నవి	101
20 మంది విద్యార్థులు ఉన్నవి	129

నిబంధనల ప్రకారం సర్దుబాటు..: ఉపాధ్యాయుల సర్దుబాటుతో విద్యార్థులకు మెరుగైన విద్య అందించవచ్చు. అక్టోబర్ మొదటి వారంలో ప్రక్రియ పూర్తి చేస్తాం. బోధనాపరంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- గోవిందరాజులు, జిల్లా విద్యాశాఖ అధికారి

దసరాకు 649 ప్రత్యేక బస్సులు

నేటి నుంచి అందుబాటులోకి సర్వీసులు



మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు 649 ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించారు. నగరాల్లో స్థిరపడిన వారు దసరా పండగ కుటుంబ సభ్యులతో కలిసి చేసుకునేందుకు పల్లెలకు తరలి వస్తారు. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా హైదరాబాద్‌కు బస్సులు నడపనున్నారు. అచ్చంపేట-105, వనపర్తి-95, గద్వాల-89, మహబూబ్‌నగర్-69, కల్వకుర్తి-67, షాద్‌నగర్-59, కొల్లాపూర్-58, నారాయణపేట-54, నాగర్‌కర్నూల్-53 బస్సులను నడపనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో 25 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, షాద్‌నగర్, కొత్తకోట, పెబ్బేరు, మక్తల్, కోస్గి, అయిజ, ఆమన్‌గల్, తెలకపల్లి, డిండి, బిజినేపల్లి, మద్దూర్, మరికల్, గణపూర్ బస్టాండ్ల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

రైతేరాజు 8లో..

పత్తి మిల్లు కార్మిక సంఘం ఎన్నికలు నేడు

కల్వకుర్తి, న్యూస్‌టుడే: కల్వకుర్తి పట్టణ సమీపంలోని సూత్యలత పత్తి మిల్లులో మంగళవారం కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయి. మిల్లులో 450 మంది కార్మికులకు ఓటు హక్కు ఉంది. పత్తి మిల్లు ఛైర్మన్ పదవికి అధికార కాంగ్రెస్ పార్టీ పక్షాన బి. ఆనంద్‌కుమార్, భారాస నుంచి సూర్యప్రకాశ్‌రావు పోటీపడుతున్నారు. మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాన్నం 2గంటల వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాన్నం 3గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేస్తారు. సాయంత్రం ఫలితాలను ప్రకటించనున్నారు. ఎన్నికల అధికారిగా ఉమ్మడి జిల్లా అదనపు కార్మిక శాఖ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్‌ను నియమించారు. ఎన్నికలకు సంబంధించిన వివరాలకోసం చరవాణి ద్వారా సంప్రదించగా స్పందించటం లేదు.

కేఎల్ఐ గండి పూడ్చివేత

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: వెల్దండ సమీపంలో గండి పడిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 ప్రధాన కాల్వకు సోమవారం నీటి పారుదల శాఖ అధికారులు మరమ్మతులు చేయించారు. కెఎల్ఐ ప్రధాన కాల్వ 24.05కిలో మీటరు వద్ద ఈనెల 3న రాత్రి గండి పడింది. ఈఈ శ్రీకాంత్, డీఈఈ సామయ్య, దేవన్న పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర

డీఎస్సీ ఫలితాలు విడుదల ● నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన



విద్య శాఖ సంచాలకుల ఆదేశాలను నమోదు చేసుకుంటున్న డీఈవో రవీందర్, అధికారులు

పాలమూరు, గద్వాల అర్బన్, అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల ఎంపిక రాత పరీక్ష (డీఎస్సీ) ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెరుగైన మార్కులు, ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలను నేటి నుంచి 5వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. 2024 డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో 1,131 పోస్టులను ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల క్రితం 20 రోజుల పాటు రాతపరీక్షలు నిర్వహించారు. టెట్‌లో 20, డీఎస్సీ రాత పరీక్షలో 80 చొప్పున మొత్తం 100 మార్కులు ఉంటాయి. ఇందులో ఎక్కువ మార్కులు పొందిన వారికి మాత్రమే పోస్టులు రానున్నాయి. ఎస్జీటీ పోస్టులు కొంతమేరకు ఉన్నా.. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొన్ని సబ్జెక్టుల్లో కేవలం ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఉపాధ్యాయ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను రోస్టరు పాయింట్లు, రిజర్వేషన్ల ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణి నంబరుకు ఎస్ఎంఎస్ లేదా మెయిల్ ఐడీకి మెయిల్ ద్వారా సమాచారం అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో ధ్రువపత్రాల పరిశీలనకు ఏ తేదీన హాజరు కావాలో సమాచారం ఇవ్వనున్నారు. డీఈవోల అధికారిక వెబ్‌సైట్లలో కూడా 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అందుబాటులో ఉంచుతున్నారు. అక్టోబరు 2 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఇస్తున్నారు. పాఠశాలలు సెలవుల తర్వాత 15న ప్రారంభం కానున్నాయి. సెలవుల్లోనే ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. సెలవుల తర్వాత పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 2వేల మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించడంతో చాలా చోట ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయనుండటంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనుంది. విద్యావ్యవస్థ గాడినపడనుంది.

జిల్లాల వారీగా ఇలా పోటీ

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీటీ విభాగంలో 105 పోస్టులు స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉండగా 2,979 మంది పరీక్ష రాశారు. స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రానికి 7 పోస్టులు ఉంటే 763 మంది పరీక్ష రాశారు. ఎస్జీటీలో తుప్పలి శివసాయి అనే అభ్యర్థి 84 మార్కులు తెచ్చుకొని జిల్లాలోనే ప్రథమ ర్యాంకు సాధించాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 111 ఎస్జీటీ పోస్టులకు 3,418 (ఒక్కోదానికి 31) మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సౌమ్య ఎస్జీటీ ఫలితాల్లో 84.90 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. నారాయణపేట జిల్లాలో తెలుగు విభాగంలో 127 ఎస్జీటీ పోస్టులకు 2,608 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ప్రియాంక 87.37 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకును సాధించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్జీటీ విభాగంలో అత్యధిక మార్కులు ఇవే కావటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో తెలుగు మాధ్యమంలో 60 పోస్టులకు 2,694 మంది పరీక్ష రాశారు.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు, అభ్యర్థుల పరిస్థితి..

జిల్లా	మొత్తం అభ్యర్థులు	మొత్తం పోస్టులు	1:3 అభ్యర్థులు
నాగర్‌కర్నూల్	10,072	285	855
మహబూబ్‌నగర్	7,521	243	729
నారాయణపేట	5,972	279	837
గద్వాల	6,474	172	516
వనపర్తి	2,137	152	456

ఎంపికైన అభ్యర్థులకు నేటి నుంచి గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. పరిశీలనకు వచ్చే అభ్యర్థులు వెంట అన్ని ఒరిజినల్ అర్హత ధ్రువపత్రాలను తీసుకొని రావాలి. 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులను వివరాలను www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచాం.

- డా.గోవిందరాజులు, నాగర్‌కర్నూల్ డీఈవో

ఊపిరి బిగపట్టుకోవాల్సిందే..!

గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక అవస్థలు



నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు. ఇక్కడ మొత్తం 650 మంది విద్యార్థులుండగా 24 స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధన ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 57 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు ఉదయం సమయంలో ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు బయటే స్నానం చేయాల్సి వస్తోంది.



నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోని జ్యోతిరావు పులే బాలుర గురుకుల విద్యాలయంలో 5 నుంచి పదో తరగతి వరకు 480 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 15 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 56 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం. ఇక్కడ ఓ షెడ్డులో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో స్నానానికి, కాలకృత్యాలకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలమూరులో మొత్తం 32 ఎస్సీ, 25 బీసీ, 20 మైనార్టీ, 19 గిరిజన గురుకుల విద్యాలయాలున్నాయి. ఈ గురుకులాల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. నిబంధనల ప్రకారం ప్రతి 25 మందికి స్నానపు గదులు, 4 మరుగుదొడ్లు ఉండాలి. ఈ లెక్కన ఏ గురుకులాల్లోనూ ఇవిలేవు. ఉమ్మడి జిల్లాలో అన్ని గురుకులాల్లో కలిపి సుమారు 6,200 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. ఇందులో సగం కూడా లేనట్లు అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలని...: ఇటీవల ఓ సామాజిక కార్యకర్త రాష్ట్రంలోని పలు గురుకులాల్లో సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. దీని నివేదికను హైకోర్టుకు సమర్పించగా ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక స్నానపు గది, ఏడుగురికి ఒక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించి నివేదిక ఇవ్వాలని గురుకులాలను కోరింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు గురుకులాల్లో సర్వే నిర్వహించగా అందులో ఏ గురుకలాల్లోనూ నిబంధన ప్రకారం సౌకర్యాలు లేవు. కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆరుబయటకు వెళ్లే క్రమంలో కొన్ని చోట్ల పాములు, ఇతర క్రిమికీటకాలతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.



వనపర్తి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో మొత్తం 699 మంది చదువుతున్నారు. వీరికి 50 స్నానపు గదులు, 78 మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ విద్యాలయంలో 83 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. సరిపడా లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోడానికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు వస్తే ఎంతో మేలు..: గురుకులాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేక నిధులు కావాలి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయంలో మరుగుదొడ్ల సమస్య రావడంతో స్థానికంగా ఉన్న సంస్థ తరపున వాటికి మరమ్మతులు చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేయడానికి కూడా ముందుకొచ్చారు. అవసరమైన చోట గురుకులాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు



ప్రజావాణిలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అధికారులు ఎప్పటికప్పుడు వచ్చిన వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. సమస్య పరిష్కరించడంలో ఆలస్యం అయితే పరిస్థితిని ముందే వివరించాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దని చెప్పారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఏవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, యూసుఫ్‌అలీలు పాల్గొన్నారు.



ఇంటిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు..: నాగర్‌కర్నూల్ పురపాలిక పరిధిలోని ఉయ్యాలవాడలో మా నాన్నకు రెండు వందల గజాల స్థలంలో ఇల్లు ఉంది. నాన్నకు ముగ్గురం సంతానం. మా తమ్ముడు 20 ఏళ్ల క్రితమే ఇంట్లో నుంచి వెళ్లిపోగా ఆచూకీ లభించలేదు. నాన్న అక్కచెల్లెల్లకు దాన పూర్వకంగా రిజిస్ట్రేషన్ చేశారు. నాన్న మృతి చెందిన కొద్ది రోజుల తర్వాత ఇతరులు తప్పుడు పత్రాలతో ఓనర్‌షిప్ సర్టిఫికేట్ తెచ్చి మా ఇంటిని ఆక్రమించుకున్నారు. దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

- జ్యోతి, ఉయ్యాలవాడ, నాగర్‌కర్నూల్ మండలం



జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలి: కల్వకుర్తి నుంచి సోమశిలకు వెళ్లే ఎన్‌హెచ్ 167కే రహదారి అలైన్‌మెంటును మార్చాలి. నాగర్‌కర్నూల్ సమీపంలోని దేశిటికాల శివారులో ఇళ్ల స్థలాలు కోల్పోతున్నాం. వందల ప్లాట్లు పోతున్నాయి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద భూములు పోతే ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశాం. ఇక్కడ జాతీయ రహదారిలో స్థలాలను కోల్పోవాల్సి వస్తోంది. మాకు న్యాయం చేయండి. గజానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పలుకుతోంది. పిల్లల భవిష్యత్తు కోసం వీటిని కొనుగోలు చేశాం. విలువైన స్థలాలు పోతుండటంతో కుంగిపోతున్నాం.. మాకు న్యాయం చేయండి.

- ఇళ్ల స్థలాలు కోల్పోతున్న బాధితులు

తగ్గిన దిగుబడి.. పెరిగిన దిగుమతి



దేవరకద్రలో ఉల్లిని విక్రయిస్తున్న రైతులు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం, దేవరకద్ర గ్రామీణం : ఏ కూర వండాలన్నా ఉల్లి ఉండాల్సిందే. . ఆ ఉల్లి ధరలే పెరిగిపోవటం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బందికరంగా మారింది. గతేడాది ఉల్లి సాగు చేసిన రైతులు మార్కెట్లో సరైన ధరలు లేక తక్కువ ధరలకు అమ్ముకున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న రైతులు ఈసారి పెద్దగా సాగు చేయలేకపోయారు. వర్షాలు ఆలస్యం కావటం కూడా ఇందుకు కారణం. ఫలితంగా ఉల్లిపంట కొరత ఏర్పడి ధర పెరిగిపోతోంది.

వర్షాలతో దెబ్బతిన్న పంట : వీపనగండ్ల, తిమ్మాజిపేట, వనపర్తి, పెబ్బేరు, ఊట్కూర్, నారాయణపేట, మక్తల్, నవాబుపేట, బాలానగర్, కల్వకుర్తి, ఊర్కొండపేట, మిడ్జిల్, బిజినేపల్లి, గండీడ్, మహమ్మదాబాద్ తదితర మండలాల్లో ఉల్లిని ఎక్కువగా సాగు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 3,600 ఎకరాల్లో సాగయ్యే ఉల్లి పంట ఈసారి 1,200 ఎకరాలకు పడిపోయింది. ఇటీవలి వర్షాలతో ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన కొద్దిపాటి ఉల్లిపంట కూడా దెబ్బతింది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూ వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాకాలంలో 52 ఎకరాలు, జోగులాంబ గద్వాల జిల్లాలో 87 ఎకరాల్లోపే ఉల్లి సాగైంది. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 2,800 ఎకరాల్లో ఉల్లి సాగయ్యేది. ఈసారి 971 ఎకరాల్లోపే సాగైంది. నారాయణపేట జిల్లాలో 340 ఎకరాలకు గాను 86 ఎకరాల్లో సాగైంది. వర్షాలతో పంట దెబ్బతినటంతో కర్నూలు, నందికొట్కూరు, మంత్రాలయం, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి

భారంగా మారిన ఉల్లి ధరల పెరుగుదల

ఉమ్మడి జిల్లాకు ఉల్లి రాలేదు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు మహారాష్ట్రలోని నాసిక్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవటంతో ధర మూడింతలు పెరిగింది. క్వింటా ఉల్లి ధర జులైలో రూ.2,000 ఉండగా.. సెప్టెంబరులో రూ.5,600లకు పెరిగింది. కిలో ఉల్లి ధర జులైలో రూ.15 నుంచి రూ.20 ఉండగా.. ఇప్పుడు రూ.60కి పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యాన అధికారి కె.వేణుగోపాల్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగు తగ్గటం, వర్షాలతో పంట దెబ్బతినటమే ధరల పెరుగుదలకు కారణమన్నారు. యాసంగిలో పంట సాగు పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.

పెరిగిన ధరలు (రూ॥ల్లో) ఇలా..

నెల	క్వింటాలు	కిలో
జులై	2,000	20
ఆగస్టు	3,500	40
సెప్టెంబరు	5,600	60



భారంగా మారింది.. : ఏ కూర వండలన్నా ఉల్లి తప్పనిసరి. పెరిగిన ఉల్లి ధరలు మాకు భారంగా మారాయి. వారానికి 3 కిలోల వరకు ఉల్లి వినియోగిస్తాం. పెరిగిన ఉల్లి ధరలతో కొనుగోలు చేయలేకపోతున్నాం. ఉల్లి ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

- సంధ్యారాణి, మహిళ, గూరకొండ



రైతుకు లాభం లేదు. . : మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. రైతులు మార్కెట్‌కు పంట తీసుకెళ్తే క్వింటాకు రూ.2,500 నుంచి రూ.3,500 వరకే ఇస్తున్నారు. పేరుకే ఒకరిద్దరు రైతులకు రూ.5వేల చొప్పున చెల్లిస్తున్నారు. పెరిగిన ధర రైతులకు కూడా చెల్లించాలి.

- భగవంతు, రైతు, దేవరకద్ర

ఆకుకూర.. తినివేరా!



● చవగ్గా అందుబాటులో పోషకాహారం
● నేడు శాకాహార దినోత్సవం

పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లలో కొవ్వులేక పోవడం వలన గుండె జబ్బులు దరిచేరవు. ఆకుకూరలు, కూరగాయల్లోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలు దరిచేరని వ్వవని సర్వేలు చెబుతున్నాయి. శాకాహారంలో ఆకుకూరలకు ప్రాధాన్యం ఉండటమే కాకుండా ఎలాంటి ఖర్చులేకుండా ఇంటి పరిసరాల్లోనూ పండించుకోవచ్చు.

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

తొలిసారి 1977లో..

పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడేదిశగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని జరుపుకొంటారు. తొలిసారి 1977లో అమెరికాలో నిర్వహించారు. శాకాహార ప్రాముఖ్యత, విలువలను ప్రపంచానికి వివరించేందుకు ఇప్పటివరకు వందలాది సదస్సులను నిర్వహించారు.

అందుబాటులో ఆరోగ్యం: భారతదేశంలో అనాదిగా శాకాహారానికి ఉన్న ప్రాధాన్యం గొప్పది. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రకృతి ఇచ్చిన వరం ఆకుకూరలు. రోజూ ఏదో ఒక ఆకుకూరను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం కోసం రూ. వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు. జీవన శైలిని మార్చే సత్తా ఆకుకూరలకు ఉందని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు. ఆకుకూరల్లో తక్కువ కొవ్వు ఉండటం, అధిక ప్రొటీన్లు, ఖనిజలవణాలు అధికం. పెరడు, ఇంటి మిద్దెలపై ఖాళీ డబ్బాలు, కుండీలను వినియోగించి ఇంటికి కావాల్సిన తాజా ఆకుకూరలను పండించుకోవచ్చు.

తోటకూర : ఆకుకూరల్లో ఎక్కువమంది ఇష్టపడే తోటకూరలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలతో పాటూ, అనేక పోషకాలున్నాయి. తోటకూరను ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. క్యాన్సర్‌ని నిరోధిస్తుంది. త్వరగా జీర్ణమవడంతో పాటూ, జలుబు, జ్వరం వంటి చిన్న రోగాల బారిన పడకుండా కాపాడుతుంది. విత్తిన నాటి నుంచి 25 నుంచి 30 రోజుల్లోపు కోతకు వస్తుంది.

గోంగూర (పుంటి కూర) : గోంగూరతో చాలా లాభాలున్నాయి. తినడానికి కాస్త పుల్లగా అనిపించినా.. గోంగూర తరుచూ తినడం వలన రక్తహీనత సమస్య దరిచేరదు. గుండెకు బలం చేకూరుతుంది. గోంగూరను బాగా ఉడకబెట్టి పుండ్లపై కడితే అవి త్వరగా మానుతాయి. గోంగూర నిల్వ పచ్చడిగా వినియోగించుకోవచ్చు. విత్తిన నాటి నుంచి 15 నుంచి 20 రోజుల్లోగా గోంగూర ఆకులను ఆహారంగా తీసుకోవచ్చు.

బచ్చలి కూర : బచ్చలికూర గ్రామాల్లో విరివిగా లభిస్తుంది. ఆహారంలో తరచూ వాడటం వలన ఒంట్లో వేడి క్రమేపి తగ్గుతుంది. మూత్రంలో మంట, ఇన్‌ఫెక్షన్లపై ప్రభావం చూపుతుంది. బచ్చలి కూరను కూడా కుండీలు, ఇంటి ఆవరణలో సులభంగా పెంచుకోవచ్చు. నాటిన 30 నుంచి 35 రోజుల వ్యవధిలో కోతకు వస్తుంది.

పాల కూర : పాలకూరకు రక్తాన్ని శుద్ధి చేసే తత్వం ఉంటుంది. పాలకూరలో విటమిన్ సి, ఏ, మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్ వంటివి క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో తోడ్పడతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్‌ను అదుపుచేయడంలో పాలకూర ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ ఆకుకూర వాత, పిత్త, కఫ దోషాలను నివారిస్తుంది. విత్తనం నాటిన 20 -25 రోజుల నుంచి పాలకూరను ఆహారంగా వినియోగించవచ్చు.

కంటి చూపునకు పొన్నగంటి కూర : పొన్నగంటి కూర శరీరానికి చలువ చేస్తుంది. కంటి చూపు సమస్యతో బాధ పడేవారికి పొన్నగంటి కూర చాలా మేలు చేస్తుంది. నిత్యం ఆహారంలో తీసుకోవడం వలన కంటి చూపు మెరుగుపడుతుంది. పొన్నగంటి కూర సహజసిద్ధంగా పొలం గట్లపై వర్షాకాలంలో లభిస్తుంది.

అందుబాటులో అధిక పోషకాలు.. : సహజసిద్ధంగా పంట పొలాల్లో పెరిగే జొన్నచెంచలి, గొగ్గలి, ఎల్కచెవులకూర, తగరించ, పాయలాకు, తల్లైలా, గుప్తరేణి, గునుగు, తుమ్మె, పొన్నగంటి, నల్లకాశ, తెల్లకాశ, బుడ్డకాశ, గోరుమాడి, సన్నపాయల, తెల్లగజ్జల, చెన్నంగి, యెన్నాద్రి, అడవి సోయ కూర, చిత్రమాళ, అంగిబింగి, అడవి పుల్లకూర, బంకటి పూర, నల్లనేల ఉసిరి, ముల్లుదొగ్గలి, పులపత్రం, గంగవాయిలి వంటి సహజంగా లభించే ఆకుకూరలను ప్రజలు ఆహారంగా తీసుకోవడం లేదు. వాణిజ్యంగా సాగు చేసిన ఆకుకూరలతో పోలిస్తే వీటిలో అధిక మొత్తంలో సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్లు ఉన్నాయి. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కేవీకే ఆధ్వర్యంలో ప్రకృతిలో లభించే ఆకుకూరలపై అవగాహన కల్పిస్తున్నాం.



- హేమలత, గృహ విజ్ఞానశాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జహీరాబాద్

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లా	కూరగాయల సాగు	ఉత్పత్తి (సుమారు టన్నుల్లో)
నారాయణపేట	2,217	26,075
మహబూబ్‌నగర్	1,986	18,795
జోగులాంబ గద్వాల	4,585	52,350
నాగర్‌కర్నూల్	1,890	20,892
వనపర్తి	1,719	19,780

పెరట్లోనే కూరగాయలు..: 30 ఏళ్లుగా పెరటి తోటల పెంపకం ద్వారానే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను. నిత్యం తీసుకునే ఆహారంలో ఏదో ఒక ఆకుకూర తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తవు. ఇంటి బయట ఖాళీ స్థలం లేని వారు, మిద్దెపై కుండీల్లోనూ కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసుకోవచ్చు.


- శారద, విశ్రాంత ఉపాధ్యాయిని, పాలెం



పెరటితోట సాగులో విశ్రాంత ఉపాధ్యాయురాలు శారద

పొగాకు నారు మడి.. అధిక రాబడి

మల్దకల్, న్యూస్‌టుడే : సంప్రదాయ పంటలు సాగుచేసి ఆశించిన స్థాయిలో దిగుబడి దక్కక, గిట్టుబాటు ధరలు లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఓ రైతు మిత్రుడి సలహాతో పొగాకు నారు సాగు చేసి లాభాలబాటలో పయనిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన పెద్ద తిమ్మోతి 30 గుంటల్లో పొగాకు నారు పెంపకం చేపట్టారు. పొడవు 40 అడుగులు, వెడల్పు మూడు అడుగుల ప్రకారం 150 బెడ్లు ఏర్పాటు చేసుకుని జులై చివరి వారంలో విత్తనాలు చల్లారు. అంతకు ముందు పొలంలో రెండు ట్రాక్టర్ల పశువుల ఎరువుతో పాటు సేంద్రియ ఎరువు వేసి కలియదున్నారు. బిందు సేద్యం పరికరాలతో నీటితడులు అందించారు.



నారుమడిలో కలుపు తీస్తున్న రైతు పెద్దతిమ్మోతి

రైతేరాజు

55 నుంచి 60 రోజుల వరకు పొలంలో నాటడానికి అనుకూలంగా ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఇక్కడికే వచ్చి నారు తీసుకెళ్తున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీలు, బెడ్ల తయారీ, ఇతరత్రా అవసరాలకు రూ.1.10 లక్షల వరకు ఖర్చయినట్లు రైతు తెలిపారు. 120 బెడ్ల నారు విక్రయించగా రూ.2.50 లక్షలు వచ్చాయన్నారు. రూ.1.40 లక్షలు ఆదాయం పొందినట్లు పేర్కొన్నారు. ఇంకా 30 బెడ్ల నారు ఉందని తెలిపారు.

పొలం వద్దే కొనుగోళ్లు: పొగాకు బెడ్లలో కలుపు నివారణకు కూలీల అవసరం. కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నా. కర్ణాటకతో పాటు గట్టు, ఐటిక్యాల, గద్వాల మండలాలకు చెందిన రైతులు పొలం వద్దకే వచ్చి నారు కొనుగోలు చేస్తున్నారు. ఆరేళ్లుగా నారు పెంచి విక్రయిస్తున్నా. ఈఏడాది అనుకూలంగా వర్షాలు కురిశాయి. మంచి గిరాకీతో పాటు ధర అధికంగా పలికి లాభాలు వచ్చాయి.

- పెద్దతిమ్మోతి రైతు, తాటికుంట, మల్దకల్‌మండలం

ప్రశ్నలు - సమాధానాలు

? వరి ఆకునల్లి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? **- కృష్ణయ్య, దంతనూర్**

✔ గంధకం 3 గ్రాములు లేదా ఫాపర్‌గేట్ 2 మి.లీ లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో సూదిపురుగు (ఫిన్‌వార్మ్) నివారణకు చర్యలు తెలపండి. **- రామకృష్ణ, మున్ననూర్**

✔ లీటరు నీటిలో ఇండాక్సీకార్బ్ 1.75 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా డెల్టామిత్రిన్ 1 మి.లీ లేదా ల్యామ్డా సైహలోత్రిన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

? కందిలో మారుక గూడుపురుగు నివారణకు ఎలాంటి మందులు వాడాలి? **- స్వామి, చెన్నారం**

✔ నివారణకు వేపమందు (1500పీపీఎం) 5 మి.లీ, న్యూవులురాన్ 1 మి.లీ లేదా క్లోరాంత్రినీపోల్ 0.3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

- న్యూస్‌టుడే, మదనాపురం

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

వేరుసెనగలో సస్యరక్షణ పాటిస్తే దిగుబడులు

మదనాపురం, న్యూస్‌టుడే : యాసంగిలో సాగుచేసే వేరుసెనగలో కలుపు, చీడపీడల నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరితాంధ్ర, ధరణి, జేఎల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694 అనువైన రకాలని పేర్కొన్నారు.



సాగు చేసిన వేరుసెనగ

విత్తనశుద్ధి : విత్తనాన్ని టెబ్యూకోనోజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి మొదట చేసుకుని ఆపైన ట్రైకోడర్మా 10 గ్రాములు, రైజోబియం 5 గ్రాములు విత్తనం వేసే 2 గంటల ముందు కలుపు కొని విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం : భాస్వరం, పొటాష్ ఎరువులు విత్తే సమయంలోనే వేయాలి. ఎకరానికి 100 కిలోల సూఫర్‌ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా వేసుకోవాలి.

కలుపు నివారణకు..: విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపల కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరును ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి నేలపై పిచికారీ చేసుకోవాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే క్విజలోఫాప్.పి.ఇథైల్ ఎకరాకు 400 మి.లీ లేదా ప్రొపాక్విజఫాస్.పి.ఇథైల్ ఎకరాకు 250 మి.లీ విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు.

చీడపీడల యాజమాన్యం : రసం పీల్చే పురుగు నివారణకు ప్రిపోనిల్ 2 మి.లీ లేదా థయోమిదాక్సామ్ 0.4 గ్రాములు లేదా ఇమిడాక్లోఫిడ్ 0.3 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ వేపమందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోఫైరిఫాస్ 50ఈసీ 1.5 మి.లీ లేదా న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లేదా ఎసిపేట్ 1.5 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మంత్రులకు దసరా ఉత్సవాల ఆహ్వానం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వానం పలుకుతున్న ఈవో పురేందర్, అర్చకుడు ఆనంద్‌శర్మ

అలంపూర్,న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు అలంపూర్ ఆలయాల్లో ఉత్సవాలకు హాజరవ్వాలని మంత్రులకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణకు ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు వద్ద 68 వేల క్యూసెక్కుల వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.151, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.526 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలంలో ఎగువన 121.716, దిగువన 186.736 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

పాలమూరు క్రికెట్ జట్టు హ్యాట్రిక్

అర్ధ శతకాలు సాధించిన అభిలాష్, అబ్దుల్ రాఫె, షాదాబ్



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి వన్డే టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మెదక్‌పై గెలుపొంది హ్యాట్రిక్ సాధించింది. సోమవారం హన్మకొండలో నిర్వహించిన మూడో వన్డేలో మెదక్‌పై 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ముగ్గురు అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అభిలాష్ 66, అబ్దుల్ రాఫె 54, షాదాబ్ అహ్మద్ 53 పరుగులు చేశారు. అనంతరం లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. జిల్లా జట్టు నుంచి షాదాబ్ 4, అంకిత్ రాయ్, ముఖీత్ చెరో 2 వికెట్లు తీశారు. విజయం సాధించిన పాలమూరు జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.



అవస్థలిలా.. చదువులు సాగేదెలా..!

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 226 మంది చదువుకుంటున్నారు. వీరిలో 110 మంది విద్యార్థినులున్నారు. అందరికీ కలిపి పాఠశాల ఆవరణలో ఒక యూనిట్ మూత్రశాల మాత్రమే ఉంది. విద్యార్థినులు నిత్యం ఇలా బారులుదీరి నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి అసౌకర్యాలతో చదువుపైనా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. 116 మంది బాలురు ఆరుబయటకు వెళ్లాల్సిందే. 'మన ఊరు-మన బడి'లో మరో యూనిట్ మూత్రశాల మంజూరైనా నిర్మాణం చేపట్టలేదు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల బదిలీపై వచ్చానని, సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. **- న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం**

బతుకమ్మ పాఠం.. చరిత్రకు అద్దం



బతుకమ్మలతో మహిళలు

కొత్తకోట, న్యూస్‌టుడే : తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది బతుకమ్మ పండగ. ఇది దేశంలో అరుదైన పూల పండగ. ఏళ్ల క్రితమే మరుగున పడిన ఈ వేడుక.. రాష్ట్రం ఆవిర్భావం అనంతరం పూర్వ వైభవం సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు మహిళలు ఎంతో ఇష్టంగా జరుపుకొంటారు. ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పండగ విశిష్టతను విద్యార్థి దశలోనే తెలిసేలా పాఠ్య పుస్తకాల్లో వీటిని చక్కగా వివరించారు. బుధవారం నుంచి జరుపుకొనే ఈ పండగ విశేషాలపై పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలపై 'న్యూస్‌టుడే' కథనం..

ఇది కథ..

బతుకమ్మ గురించి ఏడో తరగతి ఉపవాచకంలో 'మన పండగలు' పాఠ్యాంశంలో చక్కగా వివరించారు. 'చోళరాజు అయిన ధర్మాంగదునికి వందమంది కుమారులు సంతానం. వారంతా యుద్ధంలో మృతి చెందుతారు. చాలా కాలం తరువాత లక్ష్మీదేవి అనుగ్రహంతో ఓ ఆడపిల్ల పుడుతుంది. ఈ పాపకు బతుకమ్మ అని పేరు పెట్టి నిండూనూరేళ్ల బతకాలని అందరూ ఆశీర్వదిస్తారు'. ఆ అమ్మాయే బతుకమ్మగా పూజలందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే గునుగు చామంతి, తోక చామంతి. తంగేడు, కట్ల, పిట్టకాలి, ఎర్రగన్నేరు, రుద్రాక్ష, బీర గుమ్మడి, ముద్దబంతి వంటి రంగురంగుల పూలు సేకరించి చక్కగా పేర్చి పైన పసుపు ముద్దను నిలిపి గౌరీదేవిగా కొలుస్తారు. ప్రతి రోజూ సాయంత్రం ఆడుకొని చెరువులో నిమజ్జనం చేస్తారు.

రోజుకో తీరు..

తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను పిలిచి కొలుస్తారు. తొమ్మిది రకాల ఫలాలు సమర్పిస్తారు. ప్రతి రోజు ప్రత్యేకంగా ఫలహారం నైవేద్యంగా పెడతారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, ఐదో రోజు అట్ల బతుకమ్మను కొలుస్తారు. ఆరో రోజును అర్రెమి అంటారు. ఎవరి ఇళ్ల వద్ద వారే ఆటలాడుకుంటారు. ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకం

తొమ్మిదో రోజు దసరాకు ఒకటి, రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకొంటారు. ఆరోజు కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటారు. కొత్త దుస్తులు ధరిస్తారు. ఆడబిడ్డలను, బంధువులను పిలుచుకుంటారు. బతుకమ్మను ఎత్తుకొని సద్దులు తీసుకుని ఆడుకున్న తరువాత చెరువుకు వెళ్తారు. జొన్న, మక్క పిండి, బెల్లం, పెసరపిండి, నెయ్యితో చేసిన పదార్థాలు, సత్తుపిండి, దోసకాయ, పెసరపప్పు, బెల్లంతో సద్దులు తయారు చేస్తారు. చెరువు వద్ద బతుకమ్మలను దించి మరోసారి ఆడుకుని చెరువులోకి సాగనంపుతారు. అనంతరం తెచ్చిన సద్దులను ఒకరినొకరు పంచుకుంటారు.

ఆట, పాటల్లో సాహిత్యం


'**బ**తుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ అమ్మలక్కలు, ఆడపడుచులు ఎంతో ఇష్టంగా ఆటపాటలు లయబద్ధంగా ఆడి పాడుతుంటారు. ప్రతి పాటలోనూ గౌరమ్మనే ఆరాధిస్తారు. ఇందులో గొప్ప సాహిత్యం ఉంటుంది. ఎక్కువగా ఆడపిల్లల జీవితాలు, కష్టాలు, అత్తవారింట్లో ఎదుర్కొనే సమస్యలు పాటల రూపంలో బయటకు వస్తుంటాయి.

సంస్కృతి చాటి చెప్పేలా..

పాఠ్యపుస్తకాల్లో సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా పాఠ్యాంశాలు ఎంతో అవసరం. వీటి వల్ల పాఠశాల దశలోనే విద్యార్థికి మన చరిత్ర తెలుస్తుంది. పండగ అంటే ఏదో కుటుంబ సభ్యులంతా కలిసి మంచి భోజనం చేయడం కాదని అందులో విశేషం ఉందని గ్రహిస్తారు. ఇలాంటి పాఠ్యాంశాలు నేటి తరానికి ఎంతో అవసరం.

- కోట్ల వనజాత, రచయిత్రి, మహబూబ్‌నగర్

అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగు



చెన్నప్పోళ్ల జయమ్మ

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ మహిళ గత వారం రోజులుగా మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచే సమయంలో అవయవదానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపింది. మక్తల్ శివాజీనగర్‌కు చెందిన చాకలి జయమ్మ గత మంగళవారం మాగనూరు మండలంలోని నల్లగట్టు మారెమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. ఆలయం వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని అక్కడి వైద్యులు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు జయమ్మ భర్త లక్ష్మణ్, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అంగీకరించారు. సరోజిని కంటి ఆస్పత్రికి ఒకరికి కళ్లు అమర్చగా, పదోతరగతి విద్యార్థికి కిడ్నీ అమర్చారు. ఇతర అవయవాలు మరికొందరికి అమర్చుతామని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. జయమ్మ మృతదేహాన్ని సోమవారం మక్తల్ తీసుకొచ్చారు. పట్టణ ప్రజలు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తూ ఇంటి వరకు ఊరేగింపుగా మృతదేహంతోపాటు వెళ్లారు.

చోరీ కేసుల్లో నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానందం, ముసుగులో నిందితులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : కొన్ని రోజులుగా జడ్చర్ల పట్టణంలోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను జడ్చర్ల పోలీసులు సోమవారం పట్టుకుని రిమాండుకు తరలించారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానంద్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద నివాసముండే చిట్యాల రవి, వేంకటేశ్వర కాలనీలో ఉండే లింగాల మహేశ్ కలిసి తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తూ వాటిలో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు జులై 30న పట్టణంలోని భవానీనగర్‌లోని వడ్ల గోపి, ఆగస్టు 19న మమతనగర్ సమీపంలో నరేంద్రసాగర్, గత నెల 14న తాలుకా క్లబ్ రోడ్డులోని హసల్ అలీలకు చెందిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తాలుకా క్లబ్ రోడ్డులోని సీసీ కెమెరాల పుటేజీలో నిందితులు ఉన్నాయి. వారిని పట్టుకుని విచారించగా చోరీలు చేశామని ఒప్పుకొన్నారు. వారి నుంచి మూడు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నగదు మాత్రం లభించలేదు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన పోలీసు సిబ్బంది నర్సింహ, విష్ణులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00



కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



బతుకమ్మతో మహిళా ఉపాధ్యాయులు



ఘనంగా బతుకమ్మ

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : వెల్దండలోనిండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు వివిధ పూలతో బతుకమ్మలను అలంకరించారు. ఉత్సాహంగా పాటలు పాడి బతుకమ్మ ఆడారు. అనంతరం సమీప చెరువులో భక్తిశ్రద్ధలతో వదిలారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపల్ జానకి, ఉపాధ్యాయులు షకీలాసుల్తానా, క్రాంతికుమారి, మంజుల, శ్వేత, కవిత, సుజాత, స్వప్న, పర్వీన తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా బతుకమ్మ

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు బతుకమ్మను తయారు చేసి ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు



అమ్రాబాద్ రేంజ్ పరిధిలో నీళ్లు తాగుతున్న కణుజు(పాతచిత్రం)



ఫర్హాబాద్ ముఖ ద్వారం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : అమ్రాబాద్ అభయారణ్యం కృష్ణానది, వన్యప్రాణులు, శ్రీశైల క్షేత్రం, అక్కమహాదేవి గుహలు, మల్లెలతీర్థం, లొద్ది, సలేశ్వరం, ఫర్హాబాద్ కేంద్రాలతో భక్తులు, పర్యాటకుల రాకతో విరాజిల్లుతోంది. నాగార్జునసాగర్, అచ్చంపేట, కొల్లాపూర్ వరకు విస్తరించి ఉన్న ఈ అడవిలో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు ఎక్కువగా ఉంటాయి. అక్టోబర్ 2న ప్రారంభమయ్యే వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 5 రోజులు క్రీడలతో పాటు వ్యాసరచన, ఉపన్యాస తదితర పోటీలు నిర్వహిస్తారు. నిత్య జీవితంలో అడవుల ఆవశ్యకత, జంతువుల సంరక్షణ, వన్యప్రాణుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ● నల్లమలలో అధికారులు చేపడుతున్న వన్యప్రాణి సంరక్షణ చర్యలతో ఏటికేటి పెద్ద పులుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది రాష్ట్ర అటవీశాఖ అధికారుల నివేదిక ప్రకారం పులుల సంఖ్య 34కు చేరింది. దీంతో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తమై అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ నుంచి శ్రీశైలం పాతాళగంగ వరకు ప్లాస్టిక్(నీళ్ల బాటిళ్లు, కవర్లు)ను నిషేధించారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఛైర్మన్లు

అచ్చంపేట న్యూటౌన్, అచ్చంపేట, న్యూస్‌టుడే : ఇటీవల వివిధ పాలకవర్గాలకు ఛైర్మన్లుగా నియామకమైన వారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ అంతటి రజిత, శ్రీ ఉమామహేశ్వర, మద్దిమడుగు దేవస్థాన ఛైర్మన్లు మాధవరెడ్డి, రాములు నాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేందర్, పురపాలక ఛైర్మన్ శ్రీనివాసులు సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికుడికి కిట్ అందజేస్తున్న వైద్యాధికారులు

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

తాడూరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో నిత్యం పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించే పారిశుధ్య కార్మికులు ఆరోగ్య అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీజన్ వ్యాధుల నివారణ ప్రోగ్రామ్ అధికారి డా. శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. డా. శ్రీనివాసులు, డీపీవో రామ్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. వెంకట్‌దాసు మాట్లాడారు. కార్మికులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 87మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధిగ్రస్థులను గుర్తించి మందుల పంపణీ చేశారు. కార్మికులందరికీ శానిటేషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మచారి, వైద్యులు డా. సంతోశ్‌అభిరామ్, సురేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

తెలకపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో సోమవారం విజేత విద్యార్థులకు పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు యాదయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. స్వేరోస్, విజ్డం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు యాదయ్య

సమస్య : నార్లాపూర్ చెంచుగూడెంలో బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో నీటి ట్యాంకు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. **- చెంచు ఈదన్న**

సమాధానం : సమస్యను ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. **- కృష్ణయ్య, పాఠశాల హెచ్‌ఎం**



అసంపూర్తిగా నీటి ట్యాంకు

కొల్లాపూర్, న్యూస్‌టుడే

లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి



కొల్లాపూర్: చౌరస్తాలో నిరసన తెలుపుతున్న భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు పురేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గోశాలలు నిర్మించి వాటి పాల నుంచి వచ్చిన నెయ్యిని లడ్డూకు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పులి భరత్, మహేష్, భాజపా నాయకులు సందు రమేష్, శివకృష్ణ, కడ్తాల కృష్ణ, కాశీపురం మహేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి యువకుడికి డీఎస్సీ ఫలితాల్లో జిల్లా రెండో ర్యాంక్



కె.రమేశ్

తెలకపల్లి,న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన యువకుడు కొమ్ము రమేశ్ సోమవారం విడుదలైన డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో ఆంగ్లంలో ఎస్ఏగా జిల్లా 2వ ర్యాంక్ సాధించారు. 2024 డీఎస్సీ పరీక్షను జులైలో నిర్వహించారు. గత నెలలో వెలువడిన గురుకుల ఫలితాల్లో రమేశ్ టీజీటీ ఆంగ్లం సాధించి ప్రస్తుతం తెలకపల్లి జ్యోతిబా బాలుర గురుకులంలో వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నెలన్నర కాలంలోనే రెండు ఉద్యోగాలకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందని రమేశ్ చెప్పారు.

జిల్లాలో రెండో ర్యాంకు



మదుగం రాము

పెంట్లవెల్లి , న్యూస్‌టుడే : పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన మదుగం రాము ఎస్‌జీటీలో జిల్లాలో రెండో ర్యాంకు(73.40) సాధించారు. పాఠశాల విద్యాభ్యాసం పెంట్లవెల్లి జడ్పీ బాలుర, ఇంటర్ కొల్లాపూర్‌లో ప్రైవేటు కళాశాలలో పూర్తి చేశారు.

డీఎస్సీలో మూడో ర్యాంకు



సురేష్‌బాబు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : సోమవారం వెలువడిన డీఎస్సీలో ఫలితాల్లో పలువురు ప్రతిభ చాటారు. పెద్దకార్పాములకు చెందిన మునిపాల సురేష్ బాబు స్కూల్ అసిస్టెంటుగా ఫిజికల్‌సైన్స్‌లో 74.23 మార్కులతో జిల్లాలో మూడవ ర్యాంకు సాధించారు. పేద కుటుంబంలో పుట్టి ఇబ్బందుల మధ్యే చదువు కొనసాగించారాయన.

4వ...



చక్రీదర్‌రెడ్డి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ పట్టణానికి చెందిన సుంకిరెడ్డి డీఎస్సీ పరీక్షలో ప్రత్యేక విద్య (స్కూల్ అసిస్టెంట్)లో జిల్లాలో 4వ ర్యాంకు సాధించారు. ఆయన ప్రస్తుతం పట్టణంలోని ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు విద్యబోధన చేస్తున్నారు.

పీడీగా మొదటి...



జానునాయక్

అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : చేదురుబావితండాకు చెందిన నేనావత్ జానునాయక్ డీఎస్సీ ఫలితాల్లో పీడీగా జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించారు. జిల్లాలో ఓపెన్ కేటగిరిలో ఒకటే పీడీ పోస్టు ఉందని జానునాయక్ చెప్పారు. గతంలో మూడుసార్లు పీఈటీగా ఎంపికైనట్లు తెలిపారు. ప్రస్తుతం పెంట్లవెల్లి మండలం జటప్రోలు ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : **దేవర**
కల్వకుర్తిలో.. పార్థసారథి : **దేవర,** నేషనల్ : **దేవర**

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



టమాటా 60, వంకాయ 45, బెండ 42, మిరప 50, కాకర 64, బీర 64, క్యాలిఫ్లవర్ 68, క్యాబేజీ 40, క్యారెట్ 64, దొండ 48, ఆలుగడ్డ 45, ఉల్లిగడ్డ 55, గోకర 64, దోస 40, ఆనంకాయ 16, చిక్కుడు 64, మునగకాయ 78, బీట్‌రూట్ 60, ఖీర, 40, బీన్స్ 95

వృద్ధులు మనోధైర్యంతో జీవించాలి



దుప్పట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నేతలు

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : వృద్ధులు మనోధైర్యంతో జీవనం సాగించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోక్తాల వెంకటేష్ సూచించారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎస్.ఎ.వి.గుప్త వృద్ధాశ్రమంలో 22 మందికి దుప్పట్లు, పండ్లను సోమవారం అందజేశారు. బల్మూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోనూ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. డీడబ్ల్యూవో రాజేశ్వరి, సీడీపీవోలు లక్ష్మి, దమయంతి, సంస్థ సభ్యులు శ్రీనివాసులు, శివకుమార్, బాలాజీ, లింగాచారి, నరేష్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ : ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఎస్పీ కార్యాలయానికి ఏడు ఫిర్యాదులు

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 7 ఫిర్యాదులు నమోదైనట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. భూమి తగాదాలు 4, ఇతర సమస్యలకు సంబంధించి 3 ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి బాధితులకు త్వరగా న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

రహదారిని విస్తరించాలని వినతి

కందనూలు, న్యూస్‌టుడే : కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 167కె) నిర్మాణంలో భాగంగా దేశిటిక్యాల శివారులో కొత్త రహదారి నిర్మాణం చేపట్టకుండా ప్రస్తుతం ఉన్న కొల్లాపూర్ రహదారులు, భవనాల శాఖ రహదారిని విస్తరించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. శివారు ప్రాంతం గుండా కొత్త రహదారి నిర్మాణం చేపట్టడం వలన విలువైన పొలాలు, ఇళ్ల స్థలాలు కోల్పోయి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితులు సుదర్శన్‌గౌడ్, రమేష్, గోవింద్‌రెడ్డి, రామకృష్ణ, లత, సులోచన, సరిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,426

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మొక్కజొన్న క్రయ విక్రయాలు నిర్వహించారు. క్వింటా గరిష్ఠ ధర రూ. 2,426, మాదిరి ధర రూ. 1,800, కనిష్ఠ ధర రూ. 1,799 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



విశాఖపట్నంలో విద్యార్థులు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో కొల్లాపూర్ పీజీ కళాశాల సోషల్‌వర్క్ విద్యార్థులతో పాటు అధ్యాపకులు సోమవారం పర్యటించారు. పర్యటన అరకులోయ వరకు కొనసాగుతుందని ప్రధానాచార్యులు మార్క్‌పోలోనియస్ తెలిపారు. తొమ్మిది రోజుల పాటు గిరిజనులు, పట్టణ స్థితిగతులు, సామాజిక అంశాలపై అధ్యయనం చేయనున్నట్లు చెప్పారు. పరిశీలకులు డా.ఎల్. వెంకటేశం, అధ్యాపకులు దేవరాజ్ ఉన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్ఐడీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం విధుల్లోకి వచ్చి అధికారులకు చెప్పాకుండా విందు భోజనాలకు వెళ్లడం సరికాదని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శివకుమార్ అన్నారు. వారిపై ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీల ఎంపికలు ప్రారంభం

అచ్చంపేట టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానం పేరును రాజీవ్ ఎన్టీఆర్‌గా మార్చి అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేటలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సోమవారం జిల్లా గిరిజన అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు జోనల్‌స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. వీటిని జిల్లా డీటీడీవో అధికారి ఫిరంగితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని ఆరు డివిజన్ల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నవంబరు 5, 6, 7వ తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ ఛైర్మన్ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిత, పుర ఛైర్మన్ శ్రీనివాసులు, ఐటీడీఏ పీఓ రోహిత్‌గోపిడి, డీవైఈఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : రైతులకు, వినియోగ దారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించాలని ఎలాంటి సమస్యలు వచ్చినా సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్తుశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో విద్యుత్తు వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఓవర్ లోడ్ సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి మరమ్మతులు వచ్చినా రైతులను ఇబ్బందులు పెట్టకుండా వెంటనే స్పందించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి, ఆమనగల్లు ఏడీఈలు చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఏఈలు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీని వర్తింపజేయాలని సింగిల్‌విండో ఛైర్మన్ భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడారు. బ్యాంకు ద్వారా తీసుకున్న స్వల్ప, దీర్ఘ కాలిక రుణాలతో అర్థికాభివృద్ధి సాధించి సకాలంలో చెల్లించాలని సూచించారు. 1,778 మంది రైతులకు గాను 378 మంది రైతులకుపైగా రుణమాఫీ అయ్యిందని, మరో 1400మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. వైస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు నాగులునాయక్, రాఘవేందర్‌రెడ్డి, శేఖర్, గండయ్య, సిబ్బంది శ్రీనువాసులు, వెంకట్‌రెడ్డి, సాజిద్, సాయిబాబగౌడ్ పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఖాళీల్లో గిరిజనులకే అవకాశమివ్వాలి

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఏజెన్సీ ప్రాంతంలోని ఉపాధ్యాయ ఖాళీలను ఆ ప్రాంతంలోని గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని డీఎస్సీ 2008 అభ్యర్థులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహరెడ్డికి సమస్యను వివరించారు.



ఆందోళన చేస్తున్న రైతులు

రుణమాఫీ కాలేదని రైతుల ఆందోళన

పెంట్లవెల్లి , న్యూస్‌టుడే : పెంట్లవెల్లి మండలంలోని సొసైటీలో రైతు రుణమాఫీ కాకపోవడంతో భారాస నాయకులు, రైతులు సోమవారం కొల్లాపూర్-పెబ్బేర్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. సింగిల్‌విండో ఛైర్మన్ విజయరామరావు మాట్లాడుతూ.. పెంట్లవెల్లి సొసైటీలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదన్నారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. భారాస మండలాధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సురేందర్‌గౌడ్, రాము, రైతులు బాలస్వామి, నాగార్జున, కురుమయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ బాలుడి మృతి



హేమంత్ రోహన్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అమ్రాబాద్ మండలం వటవర్లపల్లికి చెందిన కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఈనెల 23న ఆయన రెండవ కుమారుడు హేమంత్ రోహన్(4)కు జ్వరం రాగా ఆసుపత్రిలో చికిత్స చేయించారు. 24న ప్రభుత్వాస్పత్రిలో రక్త పరీక్షలు చేయించగా టైఫాయిడ్‌గా తేలింది. అదేరోజు రాత్రి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా ఆదివారం రాత్రి మృతిచెందాడు. దీంతో ఆ బాలుడు 1వ తరగతి చదువుతున్న ప్రయివేటు పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటించారు.

గుర్తు తెలియని వ్యక్తి .. కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందినట్లు ఎస్సై గోవర్ధన్ సోమవారం తెలిపారు. అతడి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

కుళ్లిన మృతదేహం లభ్యం లింగాల, న్యూస్‌టుడే : కుళ్లిన మృతదేహం సోమవారం లభ్యమైంది. అచ్చంపేట సీఐ రవీందర్ తెలిపిన వివరాలు ఇలా..లింగాల గ్రామానికి చెందిన లింగస్వామి, ఉలన్‌శంకర్ మొక్కజొన్న పంట చుట్టూ విద్యుత్తు తీగలతో కూడిన కంచె ఏర్పాటు చేశారు. లింగాలకు చెందిన అంగోత్ దేవేందర్(21) శనివారం ప్రమాదవశాత్తు వాటికి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. తల్లి సోని ఫిర్యాదు మేరకు లింగస్వామి, శంకర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు.



దేవేందర్

అదుపుతప్పి బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు వెల్దండ గ్రామీణం : వెల్దండ మండల కేంద్రంలో మేకలను తప్పించబోయి ద్విచక్రవాహనం బోల్తా పడటంతో ద్విచక్రవాహనాదారుడు మహ్మద్ అజ్మాత్ గాయపడ్డారు. సోమవారం గ్రామ సమీపంలో గల పెట్రోల్ పోసుకునేందుకు అజ్మాత్ తన ద్విచక్రవాహనంపై బయలుదేరగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

మహిళ అదృశ్యం వెల్దండ గ్రామీణం : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం పొలానికి వెళ్లిన మహిళ తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మరో ఘటనలో.. అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఉప్పునుంతల మండలం దాసర్లపల్లికి చెందిన గంగుల లింగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని మధురానగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఈనెల 20న ఆయన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెదికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అమరేందర్‌రెడ్డి సోమవారం అచ్చంపేట ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఇందిర తెలిపారు.

యువకుడికి రిమాండ్ కందనూలు : పట్టణంలో సెప్టెంబర్ 18న నిర్వహించిన వినాయకుని నిమజ్జనం సందర్భంగా యువకుడు శివ పోలీసు విధులకు ఆటంకం కల్గించడంతో పాటు డీఎస్పీ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగాడు. పోలీసుల విధులకు ఆటంకం కల్గించాడని హెడ్ కానిస్టేబుల్ తఖీ అదే రోజు ఠాణాలో ఫిర్యాదు చేశారు. యువకునిపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

ఖాతాలో నుంచి డబ్బు మాయం కందనూలు : పట్టణంలోని ఎర్రగడ్డ కాలనీకి చెందిన శ్రీనివాసులు సెప్టెంబర్ 9న చాటింగ్ చేస్తుండగా చరవాణి హ్యాకింగ్‌కు గురైంది. దీంతో బ్యాంకు ఖాతాలో నుంచి రూ. 47,977లు బదిలీ అయినట్లు సందేశం వచ్చింది. వెంటనే బాధితుడు సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పరిశీలించగా సైబర్ నేరస్థుడు అప్పటికే నగదు డ్రా చేసుకున్నాడు. సోమవారం పట్టణంలోని ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు

వెల్దండ : ప్రధాని నరేంద్ర మోదీ పాలనపై ప్రజలకు విశ్వాసం కలిగింది ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా భాజపా సభ్యత్వాలు తీసుకుంటున్నారని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాదు అన్నారు. సోమవారం వెల్దండ మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భాజపా నాయకులు జంగయ్యయాదవ్, రామకృష్ణ, నీలకంఠరవి, దశరథం, శ్రీశైలం, గెల్వయ్య, శివప్రసాదు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేటలో నిర్వహించిన పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) నియోజకవర్గస్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభన చాటారు. 17 ఏళ్లలోపు బాలికల విభాగంలో వాలీబాల్‌లో రేఖ, శివాని, శ్రీవల్లి, కనిమొళి ప్రథమ బహుమతి సాధించారు. 14 ఏళ్లలోపు బాలుర విభాగంలో వాలీబాల్‌లో దేవేందర్, ప్రవీణ్ ప్రథమ బహుమతి సొంతం చేసుకున్నారు. జిల్లాస్థాయి పోటీలకు నాగేశ్, నాగార్జున, సిద్ధు, ఐష్, గౌరి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శేఖర్ తెలిపారు. సోమవారం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు శశిరేఖ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక

ధన్వాడ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపికల్ని ఎస్‌జీఎఫ్ అధికారులు పూర్తి చేశారు. 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో 30 నుంచి 62 కిలోల బరువు పరిధిలో నందిని, నిఖిత, సీతామహలక్ష్మి, శిరీష, ప్రియమణి, మౌనిక, గంగమ్మ, కీర్తి ఎంపికయ్యారు. 17 ఏళ్ల విభాగంలో నేహశ్రీ, శిరీష, జె. శిరీష, బాలమణి, జగదీశ్వరి, శివరంజని, సఫేరా, సోనమ్మలు ఉన్నారు. 19 ఏళ్ల విభాగానికి సంబంధించి 50 నుంచి 53 కిలోల బరువు పరిధిలో గీతా, రజిత, గీత, సాయి వైష్ణవి ఎంపికయ్యారు. బాలుర 14 ఏళ్ల విభాగంలో 35 నుంచి 68 కిలోల పరిధిలో అఖిల్, రాకేష్, కుమార్, ప్రవీణ్, నరేందర్, జగన్ నాయక్, రోషన్, అరవింద్ వెంకటేష్‌లు ఎంపిక కాగా 17 ఏళ్ల విభాగంలో భాను, రాజేష్, నందు, మధు, మహేష్, ప్రవీణ్‌నాయక్. గిరి ఎంపికయ్యారు. 19 ఏళ్ల విభాగంలో జె. అరుణ్, చరణ్‌నాయక్, పవన్, ముకుందలు ఎంపికయ్యారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం : తపస్

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తపస్ (తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం) జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. సోమవారం తిమ్మాజిపేట మండల తపస్ అధ్యక్షుడిగా పాలమూరు నిరంజన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. 317 జీవో అమలులో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారిని తిరిగి సొంత జిల్లాలకు పంపించాలన్నారు. సీపీఎస్ విధానంపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా, మండల నాయకులు చంద్రమోహన్, సుధీర్, సుధాకర్‌రెడ్డి, రఘు, లక్ష్మినారాయణ, వెంకటేశ్వర్లు, రవితేజ, శ్రీవాణి, లలిత పాల్గొన్నారు.